
సాక్షి ఒడిశా

శనివారం । 20 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,68,248లు. బంగారం 2గ్రాము 200 మిల్లీగ్రాములు. వెండి 105 గ్రాములు 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భక్తుల బియ్యం వృథా కావు

భువనేశ్వర్‌: పూరీ శ్రీమందిరం వారసత్వ ప్రాకార మహోత్సవం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా భక్తుల నుంచి సేకరించిన బియ్యం వృథా కావు ఆలయ వర్గాలు తెలియజేశాయి.

- 8లో



నేటి నుంచి చిలికాలో డాల్ఫిన్ల గణన

చిలికా సరస్సులో డాల్ఫిన్ల గణన శనివారం నుంచి ప్రారంభమవుతుంది.

- 8లో

న్యూస్‌రీల్‌

పేదలకు రగ్గుల పంపిణీ



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌ సమితి టికిరి గ్రామంలో ఉన్నటువంటి పేదలకు స్థానిక డీఎస్‌ఆర్‌ సేవా సంస్థ రగ్గులను శుక్రవారం పంపిణీ చేసింది. ఈ సంస్థ వ్యవస్థాపకుడు ధర్మాన రాజు, అతని మిత్రులు కలిసి గ్రామంలోని 50 కుటుంబాలకు ఈ రగ్గులను పంపిణీ చేశారు. గత కొద్ది సంవత్సరాలుగా ఈ సంస్థ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడంతో పాటు పేదలకు ప్రతీవారం అన్నదానం వంటివి నిర్వహిస్తున్నట్లు రాజు తెలియజేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత

జయపురం: స్థానిక టాటా పవర్‌ దక్షిణ ఒడిశా సప్లయ్‌ లిమిటెడ్‌(టీపీఎస్‌వోడీఎల్‌), సంబాద్‌ అమొ ఒడిశాలు సంయుక్తంగా పవర్‌ హౌస్‌ కూడలి వద్దనున్న సీఆర్‌సీ కార్యాలయ ప్రాంతంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ మన్మథనాథ్‌ మిశ్ర ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు సిబ్బందితో పాటు స్థానిక యువత ముందుకొచ్చారు. టాటా కంపెనీ కేవలం వ్యాపారమే కాకుండా సమాజ సేవా కార్యక్రమాలు సైతం చేపడుతుందని సీఈవో అమిత్‌ గర్గ్‌ వెల్లడించారు. శిబిరంలో మొత్తం 55 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా సంస్థ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ వరుణ చౌదరి, దక్షిణ ప్రాంత సీఎస్‌ఆర్‌ చీఫ్‌ రణధీర్‌ కుమార్‌, సంబాద్‌ దినపత్రిక జయపురం ఎడిషన్‌ మేనేజర్‌ నవీన్‌ చంద్రసాహు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



చర్చల్లో పాల్గొన్న కార్మిక నేతలు

జయపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక సేవా పేపర్‌ మిల్లు కార్మికులు జయపురం లేబర్‌ డిప్యూటీ కమిషనర్‌ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. కార్మిక నేత ప్రమోద్‌ కుమార్‌ మహంతి నేతృత్వంలో కార్మికులు, విశ్రాంత కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌ నరేంద్ర రయికర్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కార్మిక నేత మహంతి మాట్లాడుతూ మిల్లు కార్మికులు, విశ్రాంత కార్మికుల డిమాండ్లను యాజమాన్యం నెరవేర్చడం లేదని ఆరోపించారు. ఇప్పటివరకు బకాయి వేతనాలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లులో నెలకు 5,500 టన్నుల పేపరు ఉత్పత్తి జరుగుతున్నా, యాజమాన్యం కార్మికుల బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. దీంతో సమస్యల పరిష్కారానికి డిప్యూటీ కమిషనర్‌ హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. చర్చల్లో కార్మిక నేతలు బనమాలి పాత్రో, అలేక్‌ పాత్రో, డి.పి.అగస్థి, హనుమంతరావు, గోవిందరాజు పాల్గొన్నారు.

పాత్రికేయుడి మృతికి సంతాపం



గజమోహన్‌ గొరాడియా (ఫైల్‌)

రాయగడ: స్థానిక ఒడియా టీవీ ఛానల్‌ జర్నలిస్ట్‌ గజమోహన్‌ గొరాడియా (36) గురువారం రాత్రి విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహాన్ని శుక్రవారం విశాఖపట్నం నుంచి అతని సొంత గ్రామమైన కల్యాణ సింగుపూర్‌ తరలించారు. స్థానిక కపిలాస్‌ కూడలికి ఉదయం చేరుకున్న ఆయన మృతదేహాన్ని చూడడానికి పెద్ద సంఖ్యలో పాత్రికేయులు హాజరయ్యారు. ఆయన అకాల మృతికి జిల్లా యంత్రాంగం తరుపున జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్‌ ప్రధాన్‌, పాత్రికేయులు, ప్రెస్‌క్లబ్‌ ప్రతినిధులు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ప్రాణం తీసిన పొగమంచు

- రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి
- మరొకరి పరిస్థితి ఆందోళనకరం
- కుల్లాడలో విషాదఛాయలు



ఎంకేసీజీ వద్ద కుల్లాడ గ్రామస్తులు



రోధిస్తున్న విద్యుత్‌ ఉద్యోగి కుటుంబ సభ్యులు

బరంపురం: తెల్లవారు జామున, రాత్రి వేళల్లో రహదారులను దట్టంగా కమ్మేస్తున్న పొగమంచు ప్రమాదాలకు కారణమవుతోంది. కనీసం పది అడుగుల దూరంలో ఎవరున్నారో గుర్తించలేని పరిస్థితి నెలకొంటుండడంతో ప్రాణాపాయ పరిస్థితి నెలకొంటోంది. గంజాం జిల్లాలో దట్టంగా కురుస్తున్న పొగమంచు ఐదు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. సురడా రహదారిలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. సమాచారం అందుకున్న సురడా పోలీసులు, అగ్నిమాపక బృందం ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

ఉదయం 6 గంటలకు...

ఐఐసీ అధికారి సంతోషిని ఓరామ్‌ తెలిపిన వివరాల మేరకు.. ఉదయం 6 గంటల సమయంలో గంజాం జిల్లా కుల్లాడ గ్రామం నుంచి ఒక ద్విచక్ర వాహనంపై ముగ్గురు విద్యుత్‌ ఉద్యోగులు సురడా వస్తున్నారు. అదే సమయంలో సురడా నుంచి కుల్లాడ గ్రామనికి మరో ద్విచక్ర వాహనంలో ముగ్గురు వ్యక్తులు వెళ్తున్నారు. ఆ సమయంలో దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 6 మంది తీవ్రంగా గాయపడడంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే వారిని సురడా బ్లాక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ వారిని పరిశీలించిన వైద్యులు అప్పటికే నలుగురు మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బరంపురం ఎంకేసీజీ మెడికల్‌ ఆస్పత్రికి తరిస్తుండగా మరొకరు మృతి చెందారు. ప్రస్తుతం ఒకరు చికిత్స పొందుతున్నారు. అతని పరిస్థితి సైతం ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుల్లో ఇద్దరు సౌత్‌–కో విద్యుత్‌ ఉద్యోగస్తులు ఉండగా, మరో ముగ్గురు కుల్లాడ గ్రామానికి చెందినవారుగా గుర్తించారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.



మృతి చెందిన కుల్లాడ గ్రామస్తుడు



మృతి చెందిన విద్యుత్‌ ఉద్యోగి



సంఘటన స్థలంలో తీవ్ర గాయాలతో కుల్లాడ గ్రామస్తుడు

కమ్ముకుంటున్న పొగమంచు

- 19 జిల్లాలకు దట్టమైన పొగమంచు హెచ్చరిక

భువనేశ్వర్‌: రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో దృశ్యమానత దిగజారింది. కోస్తా ఒడిశాలోని బంగాళాఖాతం ప్రాంతంలో చురుకైన అల్పపీడనం ప్రభావంతో ఉత్తర, కోస్తా ఒడిశాలో పొగమంచు వాతావరణం నెలకొన్నట్లు స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కార్యాలయం తెలియజేసింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా కార్యాలయాలకు వెళ్లేవారు, పాఠశాలలకు వెళ్లేవారు ఇబ్బందులకు గురయ్యారు. భువనేశ్వర్‌, కటక్‌ జంట నగరాల్లో దట్టమైన పొగమంచు కారణంగా దుకాణాలు, ఇతరేతర సంస్థలు ఆలస్యంగా తెరిచారు. మరో మూడు రోజుల పాటు పొగమంచు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో 19 జిల్లాల్లో దట్టమైన పొగమంచు కురుస్తుందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. సుందర్‌గడ్‌, బాలాసోర్‌, కెంజొహర్‌ జిల్లాల్లో ఈనెల 25 వరకు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఎల్లో అలెర్ట్‌

కందమాల్‌, నయాగడ్‌, ఖుర్దా, గంజాం, కలహండి, బొలంగీర్‌, సోన్‌పూర్‌, బౌధ్‌, కటక్‌, డెంకనాల్‌, అంగుల్‌, సుందరగడ్‌, బర్‌గడ్‌, సంబల్‌పూర్‌, మయూర్‌భంజ్‌, కెంజొహర్‌, కేంద్రాపడా, బాలాసోర్‌ జిల్లాలకు దట్టమైన పొగమంచు హెచ్చరిక జారీ అయింది. ఈ ప్రాంతాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షం, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. తదుపరి 4 రోజుల పాటు తేలికపాటి వర్షం, ఉరుములతో కూడిన వాన జల్లు కురుస్తుందని ముందస్తు సమాచారం. రానున్న 4, 5 రోజులలో రాత్రి పూట ఉష్ణోగ్రతలో పెద్దగా మార్పు ఉండదని ఐఎండీ తెలిపింది.

గుజరాత్‌ పర్యటనకు గిరిజన యువత



ప్రయాణానికి సిద్ధమవుతున్న గిరిజన యువతతో జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితికి చెందిన 30 మంది గిరిజన యువత బీఎస్‌ఎఫ్‌ తరుపున గుజరాత్‌ పర్యటనకు సిద్ధమయ్యారు. రెండో బెటాలియన్‌ అధికారి సైలేంద్ర కుమార్‌ సిన్హా నేతృత్వంలో మత్తిలి సమితి సలీమ్‌, తేంతులిగుమ్మ, సింగల్‌గూడ, కర్తన్‌పల్లి, ఉదయ్‌గిరి, కోప్రా, కన్రభట్ట, నూవగూడ, ముండగూడ గ్రామాలకు చెందిన యువతను ఎంపిక చేశారు. వారిలో 15 మంది అమ్మాయిలు, 15మంది అబ్బాయిలు ఉన్నారు. వీరితో పాటు ముగ్గురు జవాన్లు వెళ్లి గుజరాత్‌లో ఉన్నటువంటి పర్యటన ప్రదేశాలు, క్రీడాకారులు, రాజకీయ నేతలను చూపిస్తారు. ఈనెల 21వ తేదీ నుంచి 27వ వరకు పర్యటన ఉంటుంది.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కుహరో

రాయగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్‌ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్‌ కుహరో సూచించారు. స్థానిక హోటల్‌ తేజస్వీలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై అవగాహన సదస్సును జిల్లా యంత్రాంగం గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతివృత్తుల వారికి విశ్వకర్మ పథకం ఆశా దీపంగా నిలుస్తుందన్నారు. కమ్మరి, కుమ్మరి, మేదరి వంటి ఎందరో చేతివృత్తుల వారి సమగ్రాభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. పథకం ద్వారా 18 రకాల చేతివృత్తుల పనుల వారికి శిక్షణ కల్పించిన అనంతరం, బ్యాంక్‌ల ద్వారా తొలి విడతగా రూ.లక్ష రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. తీసుకున్న ఈ రుణాన్ని 30 నెలల్లో తిరిగి బ్యాంకుకు చెల్లించినట్లయితే పెద్ద మొత్తంలో రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. చేతి వృత్తుల వారు ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఇప్పటికే రెండు వేల మంది పేర్లు నమోదు చేయించుకున్నారని, ఇంకా మరో ఆరునెలల కాలంలో మిగిలిన వారు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ఐపీవో సవ్యసాచి సాహు అధ్యక్షతన జరిగిన జరిగిన సదస్సులో ఎంఎస్‌ఎంఈ డిప్యూటీ డైరెక్టర్‌ ఎస్‌కే రత్నం, జిల్లా పరిశ్రమల కేంద్ర జీఎం బిజయ్‌ కుమార్‌ సాహు, లీడ్‌ బ్యాంక్‌ చీఫ్‌ మేనేజర్‌ భావ రంజన్‌ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న చేతివృత్తులపై ఆధారపడిన ప్రజలు

ఫిబ్రవరి 5 నుంచి అసెంబ్లీ సమావేశాలు

భువనేశ్వర్‌: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఫిబ్రవరి 5 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవ్వనున్నాయి. ఇవి 16వ శాసనసభకు చిట్ట చివరి సమావేశాలు కావడం గమనార్హం. ఈ విడత సమావేశాలు ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఈ సమావేశాల్లో తాత్కాలిక బడ్జెట్‌ ప్రవేశపెడతామని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. సమావేశాలు పురస్కరించుకుని ఫిబ్రవరి 5న గవర్నర్‌ రఘుబర్‌ దాస్‌ ప్రసంగించనున్నారు. ఆర్థికమంత్రి విక్రమ్‌ కేశరి అరుఖ్‌ ఫిబ్రవరి 8న ముసాయిదా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున అంతకుముందే ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది.

శాసనసభ సమావేశం కార్యక్రమాలు

తేదీ	విషయం
ఫిబ్రవరి 5	గవర్నర్‌ ప్రసంగం గవర్నర్‌ ప్రసంగంపై కృతజ్ఞతల తీర్మానం
ఫిబ్రవరి 6	కృతజ్ఞతల తీర్మానంపై చర్చ
ఫిబ్రవరి 7	కృతజ్ఞతల తీర్మానంపై చర్చ
ఫిబ్రవరి 8	2024–25 ముసాయిదా బడ్జెటు ప్రతిపాదనలు ప్రవేశం ముసాయిదా బడ్జెటు తీర్మానం ముసాయిదా బడ్జెటు తీర్మానంపై చర్చ
ఫిబ్రవరి 9	ముసాయిదా బడ్జెట్‌ వ్యయ మంజూరి బిల్లు ప్రవేశం
ఫిబ్రవరి 10, 11	సెలవు (శని, ఆదివారాలు)
ఫిబ్రవరి 12	అధికారిక కార్యకలాపాలు
ఫిబ్రవరి 13	ప్రైవేటు సభ్యుల వ్యవహారాలు (బిల్లులు – తీర్మానాలు)

‘చలాన్లపై డ్రైవర్ల ఆందోళన’



ఆందోళన చేపడుతున్న వ్యాన్‌ల డ్రైవర్లు

పర్లాకిమిడి: గుసాని, పర్లాకిమిడి రూట్‌లలో తిరుగుతున్న మ్యాక్సీ పికప్‌ వ్యానులను రోడ్డు రవాణా ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు నిర్వహించకుండానే పరిమితికి మించిన లోడుతో వెళ్తున్నారని అధిక మొత్తంలో చలాన్లు విధిస్తున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వ్యాన్‌ల డ్రైవర్లు స్థానిక ఆర్టీవో కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం ఆర్టీవో సంతును కుమార్‌ పరిడాను కలిసి సమస్యలు వివరించారు. గత రెండు రోజులుగా వ్యాన్లపై రూ.30 వేల నుంచి రూ.40 వేల చలాన్లు పంపిస్తున్నారని డ్రైవర్లు వాపోయారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ.. పరిమితికి మించి మ్యాక్స్‌ పికప్‌ వ్యానుల్లో ఇనుప రాడ్లు, పైపులు లోడు చేయడం వల్ల వెనుకనుంచి వస్తున్న వాహనదారులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. కొందరు డ్రైవర్లు లైసెన్సులు కూడా రిన్యువల్‌ చేయించుకోవడం లేదన్నారు. అనంతరం డ్రైవర్లు కలెక్టర్‌ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు.



వాహనదారులతో మాట్లాడుతున్న ఆర్టీవో పరిదా

గంజాయి పంట ధ్వంసం



గంజాయి పంటలపై దాడులు చేసిన సిబ్బంది

బరంపురం: గంజాం జిల్లా అస్కా బ్లాక్‌ అటవీ ప్రాంతంలో ఎక్సైజ్‌ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టి 122 ఎకరాల్లో సాగుచేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. జిల్లా ఎక్సైజ్‌ డీఎస్పీ అభిరామ్‌ కుమార్‌ బెహరా తెలిపిన వివరాల మేరకు.. రాష్ట్ర ఎక్సైజ్‌ విభాగం, కలెక్టర్‌ దివ్యజ్యోతి పరిడా ఆదేశాలతో గురు, శుక్రవారాల్లో అస్కా పోలీసుస్టేషన్‌ పరిధి అర్జునాపల్లి, పట్టశాల, బల్లిగుడా, కొలబడా, అందరిగుడా గ్రామాల్లో సాగు చేస్తున్న గంజాయి పంటలపై దాడులు నిర్వహించారు. జేసీబీ సాయంతో మొక్కలను తొలగించి, అనంతరం నిప్పుపెట్టారు. నష్టపరిచిన గంజాయి మొక్కల విలువ సుమారు రూ.3.5 కోట్లు ఉంటుందని అస్కా తహసీల్దార్‌ కురేష్‌ చంద్ర జెనా వెల్లడించారు.



గంజాయి మొక్కలకు నిప్పు పెడుతున్న దృశ్యం

పక్షుల గణన పూర్తి



కృష్ణసాగరంలో విదేశీ వలస పక్షులు



కృష్ణసాగరం వద్ద సర్వే చేస్తున్న సిబ్బంది



గజపతి సాగరం వద్ద పక్షుల గణన చేపడుతున్న అటవీ సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో అటవీశాఖ అధికారులు వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పక్షుల గణన శుక్రవారంతో పూర్తయ్యింది. జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్‌ ఆదేశాల మేరకు ఏసీఎఫ్‌ అశోక్‌ కుమార్‌ బెహరా, అరుణ్‌ కుమార్‌ సాహు నేతృత్వంలో అటవీ సిబ్బంది 42 యూనిట్లుగా ఏర్పడి, ఏడు అటవీ రేంజ్‌లలో సర్వే చేపట్టారు. గజపతి జిల్లాలో చంద్రగిరి, మహేంద్రగిరి, కాశీనగర్‌, మోహనా, రామగిరి, ఆర్‌.ఉదయగిరి, దేవగిరి ఏడు అటవీ రేంజ్‌లలో మొత్తం 9,353 వివిధ పక్షి జాతులు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో కలిచియా కొంగలు, నీటి కొంగ, కంఠ కొంగ, హంసరాలి, పాణికుకుడా, శరాలి, దోళోఖుంపి, గయాకంగ, కాంతి కొంగలు, గెండి కొంగలు తదితర పక్షులు ఉన్నాయి. దేవగిరి అటవీ రేంజ్‌ పరిధి గజపతి, కృష్ణ సాగరాల్లో 2,660 వివిధ జాతి పక్షులు ఉండగా, విదేశాల నుంచి వచ్చిన ఫెలికాన్‌ పక్షులు ఈ ప్రాంతంలో గుడ్లు పెడుతున్నాయి. పక్షుల గణనలో అటవీ సిబ్బంది 200 మంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛ భారత్ నిర్వహణ



ఆలయంలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: జిల్లాలోని ప్రముఖ తీర్థస్థలాలు, మందిరాల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం రాజవీధిలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మందిరంలో చెత్తను తుడిచి ప్రాంగణం శుభ్రం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు పి.లత, మాజీ కౌన్సిలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతోనే భాషాభివృద్ధి



మాట్లాడుతున్న బ్లాక్ విద్యాధికారి కుమార్ నాయక్

జయపురం: సాహిత్యంతో భాషాభివృద్ధి జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భాష, సాహిత్యం, సృజనశీలత ఉత్సవాన్ని హెచ్ఎం శ్యామ్ మెహర ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జయపురం బ్లాక్ విద్యాధికారి చందన కుమార్ నాయిక్, గౌరవ అతిథిగా శిక్షణ ప్రధానోపాధ్యాయుడు కిశోర్ చంద్ర పండాలు పాల్గొని విద్యార్థులకు సాహిత్యంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి చిలికాలో డాల్ఫిన్ల గణన



శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: చిలికా సరస్సులో డాల్ఫిన్ల గణన శనివారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో డాల్ఫిన్లను లెక్కించే శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ప్రముఖ డాల్ఫిన్ పరిశోధకుడు, కలహండి విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ముంతాజ్ ఖాన్ ఈ శిక్షణ కల్పించారు. బలుగాంవ్, బొరొకులో చిలికా అభివృద్ధి అథారిటీ (సీడీఏ) పరిశోధనా కేంద్రం ప్రాంగణంలో శిక్షణా శిబిరం జరిగింది. చిలికా సరస్సులో విస్తరించిన ఇరావాడి డాల్ఫిన్‌లు, బాటిల్–నోస్ డాల్ఫిన్‌లు లెక్కిస్తారు. ఈ నేపథ్యంలో చిలికా వన్యప్రాణి విభాగం (బలుగాంవ్) పరిధి 5 రేంజిల్లో డాల్ఫిన్లను లెక్కించనున్నారు. డాల్ఫిన్‌లను ఎలా లెక్కించాలో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చామని చిలికా వన్యప్రాణి విభాగం (బలుగాంవ్) డీఎఫ్‌వో అమ్లాన్ కుమార్ నాయక్ తెలిపారు. ఈ డాల్ఫిన్ శిక్షణ శిబిరంలో 100 మందికి పైగా ఎన్యుమరేటర్లు పాల్గొని శిక్షణ పొందారు. వీరంతా 4 రోజుల పాటు డాల్ఫిన్లు గణనలో పాలుపంచుకుంటారు. ఈనెల 23వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

'వ్యక్తిగత క్రమశిక్షణ తప్పనిసరి'

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసుల్లో వ్యక్తిగత క్రమశిక్షణ తప్పనిసరని శ్రీకాకుళం అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం పోలీస్‌ల ప్రత్యేక పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ పర్యవేక్షించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరి పరేడ్, దేహ దారుఢ్యం పరిశీలించారు. ఫిట్‌నెస్, ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. పోలీస్ వృత్తిలో దేహ దారుఢ్యం, మానసిక ఆరోగ్యం రెండూ కీలకమని చెప్పారు. నిరంతరం వ్యాయామం చేయాలని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. నిరంతరం ఉత్సాహంగా, అనుకూల దృక్పథంతో పోలీసులు ముందుకు సాగాలంటే ఒత్తిడికి దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు వై.శృతి, ప్రసాదరావు, వాసుదేవ్, చొప్పరాజు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు డి.సురేష్, ఉమామహేష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి

గార: మండలంలోని అంపోలు పంచాయతీ లింగాలవలస గ్రామానికి చెందిన పెద్దాడ బుచ్చిబాబు (52)మద్యం మత్తులో మురుగు కాలువలో పడి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చిబాబు లింగాలవలస కాలనీలో నివాసం ఉంటున్నారు. తల్లితండ్రులు పాత ఊరులో ఉండగా.. అక్కడికి వెళ్తానని గురువారం రాత్రి ఇంటి వద్ద చెప్పి బయల్దేరారు. దారిలో మురుగు కా లువ వద్ద తూలిపోయి నీటిలో పడి మృతి చెందాడు. ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా.. గ్రామస్తులు కాలువలో ఉన్న బుచ్చిబాబును చూసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అప్పటికే ఆయన ప్రాణాలు పోయాయి. కుమారుడు తిరుమల ఫిర్యాదు మేరకు గార పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తుల బియ్యం వృథా కావు



మహోత్సవానికి బియ్యం అందజేస్తున్న భక్తులు (ఫైల్)

- పిండి వంటకాలు తయారు చేస్తాం
- స్పష్టం చేసిన దేవస్థాన వర్గాలు

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం వారసత్వ ప్రాకార మహోత్సవం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా భక్తుల నుంచి పచ్చి బియ్యం, వక్క, శ్రీఫలం వగైరా సంగ్రహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అర్పణ రథాలు నిర్వహించింది. రాష్ట్రం నలుమూలలు ఈ రథాలు పర్యటించి ప్రజల ఇంటి ముంగిట నుంచి పచ్చి బియ్యం, వక్క, శ్రీఫలం ఇతరేతర పదార్థాలను సేకరించాయి. అయితే ఇలా సేకరించిన పదార్థాలు వృథా అవుతాయనే ఆరోపణలు విస్తరించాయి. ఈ నేపథ్యంలో శ్రీ జగన్నాథ దేవస్థాన వర్గాలు శుక్రవారం స్పందించాయి. ప్రజలు అత్యంత భక్తిభావంతో స్వామి కార్యానికి సమర్పించిన ప్రతి బియ్యపు గింజతో పాటు వక్క వగైరా పదార్థాలను సాక్షాత్తు శ్రీజగన్నాథుని సేవలో వినియోగించనున్నట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అందజేసిన పచ్చి బియ్యం, వక్క వగైరా సామగ్రిని దేవస్థానం సువారొమహాసువారొ సేవాయత్ వర్గం ఆమోదించిందని శ్రీమందిర్ మహాసువార్ నియోగుల సంఘం అధ్యక్షుడు పద్మనాభ మహాసువార్, కార్యదర్శి నారాయణ్ మహాసువార్ తెలిపారు. వారసత్వ ప్రాకారం లోకార్పణ పురస్కరించుకుని అర్పణ రథం ద్వారా గ్రామాల వారీగా భక్తుల నుంచి పచ్చి బియ్యం, వక్క వగైరా సేకరించడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ నేపథ్యంలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. సువారొమహాసువారొ సేవాయత్ వర్గం తాజా ప్రకటనతో ఈ వివాదానికి తెరదించారు.

వంటకాల్లో వినియోగించాలని నిర్ణయం

భక్తుల నుంచి సేకరించిన పచ్చి బియ్యం స్వామికి నిత్యం నివేదించే పలు వంటకాల్లో వినియోగించాలని నిర్ణయించారు. ఖిచుడి, పిండి వంటల్లో ఈ బియ్యం వినియోగిస్తారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పల్లె నుంచి పట్టణ, నగర ప్రాంతాల్లో సంగ్రహించిన వక్కని స్వామికి నివేదించే తాంబూళంలో వినియోగించనున్నట్లు ప్రకటించారు. వంటకాలకు పనికిరాని బియ్యం పిండిగా మలచి స్వామి నిత్య సేవాదుల్లో ముగ్గులు వేసేందుకు వినియోగించి సాఫల్యం పొందనున్నట్లు వివరించారు.

సామగ్రి భద్రం

అర్పణ రథం పర్యటన పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలు సమర్పించిన బియ్యం, వక్క వగైరా సామగ్రిని భద్రంగా పదిలపరిచి పూర్తి స్థాయిలో సద్వినియోగపరచాలని నిర్ణయించారు. సేకరించిన పచ్చి బియ్యం కొయిలి వైకుంఠం ప్రాంగణంలో భద్రపరచి, వక్క హడొపా నాయెక్ సేవాయత్‌లకు అప్పగిస్తారు. పచ్చి బియ్యం, వక్క ఇతరేతర సామగ్రి సమర్పణ స్వామిపై భక్తి భావోద్వేగానికి ప్రతీకగా నిలిచాయి. వారి భావోద్వేగాలకు ఏమాత్రం భంగం కలిగించకుండా స్వామి దైనందిన సేవాదుల్లో అత్యంత పవిత్రంగా వినియోగించనున్నట్లు ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

అగ్గి పుల్లలతో అయోధ్య రామ మందిరం



పూరీకి చెందిన సృజనాత్మక శిల్పి శాశ్వత్ రంజన్ సాహు అగ్గి పుల్లలతో అయోధ్య రామ మందిరం అద్భుతమైన ప్రతిరూపాన్ని రూపొందించాడు. అసాధారణమైన నైపుణ్యంతో దీనిని 6 రోజులు శ్రమించి పూర్తి చేశాడు. దీని తయారీలో మొత్తం 626 అగ్గిపుల్లలు వినియోగించాడు. 7 సెంటీ మీటర్ల వెడల్పు, 15 సెంటీ మీటర్లు పొడవుతో రామ మందిరం నమూనా తీర్చిదిద్ది ప్రసంశలందుకుంటున్నాడు.

– భువనేశ్వర్

సైబర్ నేరాలపై అవగాహన శిబిరం



అవగాహన శిబిరంలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి సైబర్ సురక్ష అవగాహన శిబిరాన్ని జాతీయ ఇన్ఫర్మేషన్ కేంద్రం (ఎన్ఐసీ) అధికారి టి.బాలకృష్ణ మూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ అధికారులకు సైబర్ నేరాలు, స్మార్ట్‌ఫోను ద్వారా సైబర్ వ్యక్తుల నుంచి ఎలా సురక్షితంగా ఉండాలో వివరించారు. ఐటీ సీనియర్ అధికారి పవిత్రా నంద పట్నాయక్, జాతీయ ఇన్ఫర్మేషన్ సంచాలకులు(భువనేశ్వర్) జ్ఞాన రంజన్ మిశ్రా తదితరులు సైబర్ నేరగాళ్ల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఫాల్గుణీ మఝి, డీఎస్ఎస్‌వో సంతోష్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ లేదు.. నాన్న రాడు

జనమంతా సంక్రాంతి రోజున సంబరాల్లో ఉంటే.. ఆ ఇద్దరు ఆడపిల్లలు మాత్రం తల్లి మరణవార్త విని గుండెలవిసేలా రోదించారు. పండగ పూట అన్ని కుటుంబాలు బంధుమిత్ర సపరివారంతో కళకళలాడుతుంటే.. ఆ ఇల్లు మాత్రం తల్లి వెళ్లిపోయిన పక్షి గూటిలా నిశ్శబ్దమైపోయింది. నాన్న ఎటు వెళ్లిపోయాడో తెలీదు.. అమ్మ ఎందుకు ఆత్మహత్య చేసుకుందో అర్థం చేసుకునే వయసు లేదు. ఉన్న అమ్మమ్మకు ఇద్దరు ఆడ పిల్లలను పోషించేందుకు శక్తి చాలదు. ఇన్ని కష్టాల మధ్య ఇద్దరు ఆడ బిడ్డలు అవస్థ పడుతున్నారు. దాతలు మాత్రమే ఈ పిల్లలకు ఓ దారి చూపగలరు.

- ఐదేళ్ల క్రితం కుటుంబాన్ని విడిచిపెట్టిన తండ్రి
- సంక్రాంతి రోజు తల్లి ఆత్మహత్య
- దిక్కుతోచని స్థితిలో ఇద్దరు ఆడపిల్లలు

ఇచ్ఛాపురం రూరల్:

చిన్నప్పుడే తండ్రి వాత్సల్యానికి ఆ పిల్లలు దూరమైపోయారు. ఇన్నాళ్లు అమ్మ అండగా నిలబడడంతో ధీమాగా ఉన్నారు. ఇప్పుడు ఏ కష్టం వచ్చిందో ఆ కన్నతల్లి కూడా పిల్లలను వదిలి శాశ్వతంగా వెళ్లిపోయింది. ఇప్పుడా చిన్నారులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మి(31) చెన్నైలో కూలి పనులు చేసుకుంటున్న సమయంలో 11 ఏళ్ల క్రితం అక్కడే వేరే వ్యక్తితో పెరిగిన పరిచయం పెళ్లి వరకు దారితీసింది. వీరికి శరణ్య, లిఖిత పుట్టారు. ఐదేళ్ల కిందటి వరకు సుఖంగా సాగిన ఈ దంపతుల కాపురంలో కలతలు రావడంతో పెద్దలు సమక్షంలో విడాకులు తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం వెంకటలక్ష్మి వద్దనే ఆడపిల్లలు ఉంటున్నారు. ఏడాది కిందటి వరకు చెన్నైలోనే వెంకటలక్ష్మి పనిచేసేవారు. పిల్లలను తేలుకుంచిలోని తన పెద్దమ్మ వద్ద ఉంచుతూ చదివించారు. ఆరు నెలల కిందట ఆమె స్వగ్రామానికి వచ్చారు.



తల్లి మృతితో అనాథలుగా మారిన చిన్నారులు శరణ్య, లిఖితలు

సంక్రాంతి రోజు అందరూ సంతోషంగా ఉండాల్సిన వేళ.. ఏం ఆపద వచ్చిందో గానీ ఆమె ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇప్పుడు ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారిపోయారు. నా అనే వారు లేక అమ్మమ్మగా పిలిచే వెంకటలక్ష్మీ పెద్దమ్మ లక్ష్మీ వద్ద తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం చిన్నారులు శరణ్య, లిఖితలు స్థానిక తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో 4, 2వ తరగతి చదువుతున్నారు. ఇకపై వీరి ఆలన పాలన చూసేవారు ఎవరో తెలీడం లేదు. వృద్ధాప్య దశలో ఉన్న తాను నాలుగిళ్లలో బట్టలు ఉతికితే గానీ నాలుగు మెతుకులు నోటికి వెళ్లే పరిస్థితి లేదని, ఇద్దరు ఆడ బిడ్డలను ఎలా పెంచి పెద్ద చేయగలనని అమ్మమ్మ లక్ష్మీ కన్నీరు పెట్టుకుంటున్నారు. దాతలు స్పందించి పిల్లల భవిష్యత్‌కు భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

సాయం చేయదలచుకున్న వారు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి నంబర్ 9441233763ను సంప్రదించాలని కోరుతున్నారు.

ముగిసిన క్రీడా ఉత్సవాలు



రన్నర్స్‌కు చెక్కు అందజేస్తున్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న క్రీడోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని ఏడీఎం రాజేంద్ర మింజ్, అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావులు ప్రారంభించారు. ఈ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ఏడు సమితి కేంద్రాల నుంచి క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు జిల్లా పరిషత్ అధ్యక్షుడు తిరుపతిరావు చేతులమీదుగా నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ బహుమతి పొందిన జట్లకు ఈనెల 23న గజపతి స్టేడియంలో 5టీ చైర్మన్ కార్తికేయ పాండియన్ చేతులమీదుగా అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, డిప్యూటీ కలెక్టర్ త్రినాథ సాహు, సురేంద్రకుమార్ పాత్రో, జిల్లా క్రీడాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి పాల్గొన్నారు.

ముగిసిన దుర్గాదేవి జాతర



పూజలందుకున్న దుర్గాదేవి



అమ్మవారి దర్శనానికి బారువుదీరిన భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

జి.సిగడాం: మధుపాం గ్రామంలో మూడు రోజులు నిర్వహించిన దుర్గాదేవి జాతర మహోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రశాంతంగా జాతర ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా జి.సిగడాం ఎస్సై సామంతుల రామారావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. చివరి రోజున భారీగా భక్తులు వచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

'దేశ ప్రగతే లక్ష్యం'



మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నర్సింహరావు, పక్కనే కమిషనర్ ఓబులేసు, బీజేపీ జిల్లా నేతలు

శ్రీకాకుళం న్యూకాలనీ: భవిష్యత్‌లో భారతదేశం అభివృద్ధి పథంలో పయనించాలనేదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని, అందులో భాగంగానే దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర చేపడుతున్నట్టుగా బీజేపీ జాతీయ స్థాయి నేత, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నర్సింహారావు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి జీవీఎల్ హాజరై మాట్లాడారు. మోదీ గ్యారంటీ, మోదీ హామీ పేరుతో 18 సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 2047లోపు దేశాన్ని స్వయం సంవృద్ధి సాధించి అభివృద్ధి చేసుకుందామని, వలసలను వదిలించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు తదితరులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు పరిశీలన



అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించిన తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఐ అహ్మద్

కొత్తూరు: మండలంలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దు సీతాపురం – దిమిలి కూడలి మధ్య ఒడిశా చెక్‌పోస్టును స్థానిక తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఐ ఎంఏ అహ్మద్‌లు శుక్రవారం పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున చెక్ పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆంధ్రా నుంచి అనుమతులు లేకుండా ఎలాంటి వస్తువులు తీసుకువచ్చినా నిశితంగా పరిశీలించాలన్నారు. ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలని చెప్పారు.

'పిల్లల కేసులు త్వరగా పరిష్కరించాలి'



వేమన చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: చట్టంతో విభేదించే పిల్లల కేసులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక జువెనైల్ జస్టిస్ బోర్డును ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ బోర్డ్ యంత్రాంగమంతా త్వరితగతిన పిల్లల కేసులు పరిష్కారం చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కందికట్ల రాణి, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ రవికుమార్, జువెనైల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ శ్రీదేవి, లీగల్ ఆఫీసర్ లక్ష్మణరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుశీల, ఇతర న్యాయవాదులు పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

తిలారు రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



జలుమూరు: తిలారు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు పలాస జీఆర్‌పీ ఎస్.ఐ కె. షరీఫ్ తెలిపారు. ముప్పై నుంచి ముప్పై ఐదేళ్ల మధ్య వయస్సు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9440627567 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. దీనిపై ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రాష్ట్రంలో క్రీడలకు ప్రాణం పోసింది సీఎం జగన్'



జిల్లా కబడ్డీ జట్ల క్రీడాకారులతో చింతాడ రవికుమార్, సుందరరావు, ఎంవీ రమణ, సాధు శ్రీను

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో క్రీడలకు ప్రాణం పోసి, క్రీడాకారులకు ఆత్మగౌరవాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ చింతాడ రవికుమార్ అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాలలో ఈనెల 20 నుంచి 24 వరకు ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల కోసం జిల్లా క్రీడాకారులు శుక్రవారం శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ నుంచి పయనమై వెళ్లారు. వీరికి క్రీడాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకుముందు జిల్లా కబడ్డీ జట్లకు ఎంపికైన బాలురు, బాలికలకు క్రీడాదుస్తులను డాక్టర్ చింతాడ రవికుమార్ సమకూర్చారు. వాటిని ఒలింపిక్, పీఈటీ సంఘ నాయకుల సమక్షంలో క్రీడాకారులకు అందజేశారు. ఒలింపిక్ సంఘ జిల్లా సలహాదారుడు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, మెట్ట తిరుపతిరావు, కబడ్డీ సంఘ కార్యదర్శి సాదు శ్రీనివాసరావు, సాధు మసలినాయుడు, కోటేశ్వరరావు, సీహెచ్ ఫల్గుణరావు పాల్గొన్నారు.

ప్రతి కోర్సు బలోపేతం లక్ష్యం: వీసీ



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ప్రతి కోర్సు బలోపేతం చేస్తామని బీఆర్‌ఏయూ వీసీ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో శుక్రవారం బోధన సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ఉత్తమ విశ్వ విద్యాలయంగా తీర్చిదిద్దటం తన ముందు ఉన్న లక్ష్యమని వివరించారు. అందుకోసం అందరూ సహకరించాలని కోరారు. వర్సిటీలో అన్ని కోర్సుల్లో మెరుగైన ప్రవేశాలు, విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య, రిలీవైన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా పలు మార్పులు చేయాలన్నారు. ప్రతివారం అకడమిక్ కరిక్యులమ్ నిర్వహణ నివేదిక అందజేయాల్సి ఉంటుందని, విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుంటామని వివరించారు. లోపాలు ఉంటే సరిదిద్దుతామని చెప్పారు. బోధకుల్లో సమయపాలన, అంకిత భావం తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యలో ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు, ఇంటర్న్‌షిప్ తప్పనిసరని వివరించారు. విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రయోజనాలకు మాత్రమే మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య నిర్వహిస్తున్న కోర్సులు, పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది వివరాలు, రెగ్యులర్, కాంట్రాక్టు, గెస్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వివరాలు వివరించారు.

భూతగాదాలో వ్యక్తిపై దాడి

బూర్జ : మండలంలో గల అయ్యవారి పేట గ్రామానికి చెందిన చోడవరపు మురళి, సోదరుడు చోడవరపు సింహాచలం కలిసి ఇప్పిలి శిమ్మన్న అనే వ్యక్తిపై దాడికి దిగారు. స్థానికంగా 80 సెంట్ల భూమి విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ అంశాన్ని తహసీల్దార్ ఎస్.రమణారావు ఆధ్వర్యంలో పరిష్కరించుకునేందుకు ముగ్గురూ కలిసి గురువారం ఆయన కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మాటామాటా పెరగడంతో అది కాస్తా కొట్లాటకు దారి తీసింది.

ఈ కొట్లాటలో శిమ్మన్నకు దెబ్బలు తగిలి రక్తస్రావమైంది. వెంటనే ఆయనను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ బి.అశోక్‌బాబు శుక్రవారం కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

న్యూ ఢిల్లీ గణతంత్ర వేడుకలకు గిరిజన విద్యార్థులు

సీతంపేట: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో సీతంపేట మండలంలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న నలుగురు గిరిజన విద్యార్థులు ఈనెల 26న న్యూ ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించడానికి 22న వారు బయలు దేరనున్నారు. మల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల నుంచి నిమ్మక అము, సీతంపేట బాలికల గురుకుల పాఠశాల నుంచి గేదెల రమ్య, పెద్దమడి ఆశ్రమపాఠశాల నుంచి మహేశ్వరి, మందస మండలం చీపి ఆశ్రమపాఠశాలకు చెందిన సవర శ్రీను ఈ వేడుకల్లో పాల్గొననున్నారని గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర తెలిపారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనుమాదిగ



ఎంఆర్‌పీఎస్ నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా భోగి శ్రీను మాదిగ ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ ఉత్తరాంధ్ర ఇంచార్జి చిన్న సుబ్బారావు అధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కిల్లాడ సురేంద్రబాబుమాదిగ, గౌరవ అధ్యక్షుడిగా బంగారు దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా యందవరవిమాదిగ, ఉప కార్యదర్శిగా కింతలిరావు మాదిగ, కోశాధికారిగా బల్లంకి కృష్ణ మాదిగ, అధికార ప్రతినిధిగా పొందూరు విజయరామారావు మాదిగ, ప్రచార కార్యదర్శిగా గర్భాపు నరేష్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కనిగిరి చంది మాదిగ, గౌరవ సలహాదారుగా అనకాపల్లి నాగేశ్వరావు మాదిగ ఎన్నికయ్యారు.

40 మద్యం సీసాల పట్టివేత



మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఎస్సై భాస్కరరావు

గుర్ల: మండలంలోని కెల్లలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై భాస్కరరావు శుక్రవారం తెలిపారు. మద్యం తరలిస్తున్న వ్యక్తి నుంచి 40 మద్యం సీసాలు పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే మండలంలోని కలవచర్ల గ్రామ సమీపంలో పేకాట స్థావరం పై దాడి చేసి 13 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి దగ్గర నుంచి రూ. 35100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో పీజీ కోర్సులకు ప్రవేశాలు

- ఎన్‌టీఏ నోటిఫికేషన్ విడుదల
- యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. దీనికోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) నిర్వహిస్తుందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని వివిధ జాతీయ విశ్వ విద్యాలయాలు, ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో పాటు సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్స్ అయిన ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, ఎంబీఏ, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ ట్రైబల్ స్టడీస్, ఎంఏ సోసియాలజీ, మాస్టర్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ కోర్సుల్లో చేరేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 'ఈయూఈటీ-పీజీ. ఎన్‌యూఈ.టీ' లేదా పీజీసీయూఈటీ. ఎస్‌ఏఎంఏఆర్‌టీహెచ్.ఏసీఐఎన్' అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ పనివేళల్లో నేరుగా వచ్చి సంప్రదించాలన్నారు.

విధుల్లోకి అంగన్‌వాడీ సిబ్బంది

- సీడీపీఓకు జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన కార్యకర్తలు

బొబ్బిలి: కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెను విరమించి విధుల్లో చేరారు. బొబ్బిలిలో 26 అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సీడీపీఓ కార్యాలయానికి వెళ్లి జాయినింగ్ రిపోర్టులు ఇచ్చారు. అనంతరం కేంద్రాల్లో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు 40 మంది సిబ్బంది విధుల్లో చేరారని, అంతకు ముందు 9 మంది చేరారని సీడీపీఓ విజయలక్ష్మి తెలిపారు.

బాడంగిలో విధుల్లోకి 32 మంది

బాడంగి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 64 మంది అంగన్‌వాడీ సిబ్బంది శుక్రవారం విధుల్లో చేరినట్టు సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. వీరిలో తెర్లాం మండలం నుంచి 24 మంది, రామభద్రాపురం నుంచి 29 మంది, బాడంగి మండలం నుంచి 11 మంది ఉన్నారన్నారు. ఇంకా విధుల్లో చేరనివారిపై కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పాల ఉత్పత్తి పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

- పశు సంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు



పిండమార్పిడి విధానాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గొర్లె సరయు

జామి: మేలు జాతి ఆవుదూడల ఉత్పత్తి పథకం ద్వారా పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం సమూలమార్పులు చేపడుతోందని పశుసంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు అన్నారు. ఈ మేరకు జామి మండల కేంద్రంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ చేతుల మీదుగా లేగదూడల ప్రదర్శన, జిల్లాలో మొట్టమొదటి సారిగా పిండమార్పిడి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం కృత్రిమ గర్భధారణ పథకం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ విధానం ద్వారా మేలు జాతి ఆడదూడల జననం అవలంబించినట్లు తెలిపారు. వీర్యనాళిక ధర రూ.1350 కాగా ప్రభుత్వం రూ.850 రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ విధానంలో ఒక్కొక్కసారి మగ దూడలు పుట్టే ఆస్కారం ఉందన్నారు. మగ దూడ పుట్టినట్లయితే రైతులకు రూ.250 తిరిగి చెల్లిస్తారని తెలిపారు. దేశవాళీ సంతతి అంతరించకపోవడం, ఆడదూడ పుట్టడం లక్ష్యంగా పిండమార్పిడి విధానం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 23,912 పశువులకు వైద్యం అందించామన్నారు. పశువులకు హెల్త్‌కార్డులు అందించనున్నట్లు చెప్పారు. పాడిరైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకుని పాల దిగుబడి పెంచుకో వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ డీడీ వైవీరమణ, డీఎల్‌డీఏ ఈఓ దామోదరరావు, ఎఫ్‌బీఎస్ డీడీ ఎం.చంద్రశేఖర్‌రావు, ఎ.డి రెడ్డి కృష్ణ, విశ్రాంత జేడీ ఎంవీఏ నరసింహులు, అసిస్టెంట్ సర్జన్ డీఎల్‌డీఏ జగదీష్‌కుమార్, జామి, అలమండ, తాండ్రంగి పశువైద్యాధికారులు ఎ.అప్పలనాయుడు నరేష్‌కుమార్, గీతారాణి, వైఎస్సార్‌సీపీ మండలకన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి పలువురు పశువైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనలో రైతులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సరయు

23న ఎంఆర్‌కళాశాలలో జాబ్ మేళా

విజయనగరం అర్బన్: వివిధ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 23న స్థానిక ఎంఆర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్లాండ్ ఫార్మా లిమిటెడ్‌లో ప్రొడక్షన్ ప్యాకింగ్, ఏపీఐసీ ప్రొడక్షన్ విభాగాల్లో, మెడ్‌ప్లస్‌లో ఫార్మాసిస్ట్, ఫార్మసీ, సీఎస్‌ఏ విభాగాల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఆయా పోస్టులను బట్టి ఐటీఐ, డిప్లమో, డిగ్రీ ఫార్మసీ, ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్, వైజాగ్, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా 'ఎన్‌సీఎస్.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ఉవిజయనగరం ఎంఆర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 8919378915 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోలీసుల పనితీరు భేష్ : ఎస్పీ దీపిక



పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్పీ దీపిక

మెరకముడిదాం: మండలంలోని బుదరాయవలస పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసుల పనితీరుపై ఎస్పీ దీపిక సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బుదరాయవలస పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పలు రికార్డులను పరిశీలించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను ఎస్సై లోకేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో గస్తీ పకడ్బందీగా చేయాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొద్ది రోజుల్లో ఎన్నికలు సమీపిస్తుండడంతో సిబ్బంది అలర్ట్‌గా ఉండాలన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే జిల్లాలో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అలాగే జిల్లాలో 200కు పైగా బెల్టు షాపులపై దాడులు నిర్వహించామని తెలిపారు. జిల్లాలో సారా తయారు చేస్తున్న పలు ప్రదేశాలను గుర్తించి దాడులు చేసి 2500 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ మండా జవలి ఆల్ఫాన్స్, చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి, సీఐ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ పోటీలకు బాలభవన్ విద్యార్థులు



ఎ.అమిత్



ఇ.షన్ముఖసాయి



ఎస్.కోమలసాయిబాలాజీ

రాజాం: స్థానిక బాలభవన్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఈనెల 23 నుంచి జరగనున్న జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఈ సైన్స్ సదస్సును నిర్వహిస్తుందని బాలభవన్ పర్యవేక్షకుడు డాక్టర్ సుంకరి రమేష్ శుక్రవారం తెలిపారు. గుజరాత్‌లోని జున్నాగడాలో ఈపోటీలు జరుగుతున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించుట అనే అంశంపై ప్రాజెక్ట్‌కు బాలభవన్‌కు చెందిన ఎ. అమిత్(9వ తరగతి), ఇ.షన్ముఖసాయి(9వ తరగతి), ఎస్.కోమలసాయిబాలజీ(8వ తరగతి)లు ఎంపికయ్యారని వెల్లడించారు. వారిని డీఈఓ, డిప్యూటీ డీఈఓలతో పాటు రాజాం ఎంఈఓ, వరలక్ష్మి సెయింట్‌ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

పట్టుబడిన గంజాయి సీజ్

- రిమాండ్‌కు ముగ్గురు నిందితులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ పి.శ్రీధర్

గజపతినగరం: ఒడిశాలోని కొరాపుట్ నుంచి కేరళలోని తిరువనంతపురానికి అక్రమంగా కారులో తరలిస్తున్న గంజాయి గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాహనాల తనిఖీలో గురువారం పట్టుబడింది. దానిని సీజ్ చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల ప్రకారం వాహనాల తనిఖీ చేస్తుండగా ఒక కారులో గంజాయి ఉన్నట్లు ప్రొబేషనరీ డీఎస్పీ ఎస్.మహేంద్ర గుర్తించారన్నారు. ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 19ప్యాకెట్ల గంజాయి ఉందని ఒక్కో ప్యాకెట్ ఐదు కేజీలు చొప్పున మొత్తం 95కేజీలుగా గుర్తించినట్లు చెప్పారు. గంజాయి తరలిస్తున్న వారు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురానికి చెందినవారని వారిని శ్రీజిత్ యశ్వి(25), నిస్సామ్(37), శ్రీజిత్ రామస్వామి(30)లుగా నిర్ధారించామని న్నారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్‌లు, రూ.27వేల నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పి.శ్రీధర్ వివరించారు. సీజ్ చేసిన గంజాయి విలువ రూ.లక్షా90వేలు ఉంటుందని చెప్పారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, ఎస్సై యు.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ ఆధ్వర్యంలో ఐకేర్ విధానం

- ఉమ్మడి విజయనగరంలో రెండు జూట్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

బొబ్బిలి: జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ఆధ్వర్యంలో కొత్తగా ఐకేర్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు రీజనల్ కార్యాలయ అడిషనల్ డిప్యూటీ మార్కెటింగ్ మేనేజర్ రామ్‌కిరణ్ తెలిపారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన జూట్ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో రెండు కొనుగోలు కేంద్రాల ద్వారా జూట్‌ను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కొత్త విధానంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామన్నారు. గోగు సాగు, ఊరవేత, నార తీయడం, ఆరబెట్టి విక్రయానికి సిద్ధం చేయడంపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. రెండేళ్ల కిందటి రకూ 3,500 హెక్టార్లలో సాగయ్యే గోగు ప్రస్తుతం 1600 హెక్టార్లకు పడిపోయిందన్నారు. విస్తీర్ణాన్ని పెంచేందుకు ఐకేర్ విధానం తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. రెండు జిల్లాల్లో కలిపి ఐదు జూట్ మిల్లులు ఉన్నాయన్నారు. కేవలం పురితయారీకే వీలున్న భీమాలి అనే రకాన్నే ప్రస్తుతం రైతులు పండిస్తున్నారన్నారు. గోనె సంచులు, ఇతర నార వస్తువుల తయారీకి అనువుగా ఉండే కొత్త వంగడాలను అందజేస్తామని చెప్పారు. కొత్తవంగడం వల్ల మద్దతు ధర లభిస్తుందన్నారు. జేసీఐ కన్నా ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లోనే ఎక్కువ ధర పలుకుతుందన్నారు. ప్రస్తుతం బి-బాటం క్వింటా రూ.3,375లు, క్రాస్ బాటం రూ.3,275లు, బాటం 3,475, మిడిల్ రకం రూ.3,575ల ధరకు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ అరుణ్ ఉన్నారు.



మాట్లాడుతున్న జేసీఐ అధికారులు

పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని శుక్రవారం దేవదాయశాఖ తనిఖీదారు ఎస్.రాజకుమారి పర్యవేక్షణలో లెక్కించారు. చదురుగుడిలో ఏర్పాటుచేసిన ఆరు హుండీల నుంచి 85 రోజులకు రూ.84,359లు వచ్చినట్టు ఈఓ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, విశ్రాంత కార్యనిర్వహణ అధికారి జి.శ్రీరామమూర్తి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలమాంబ ప్రసాదం నాణ్యత పరిశీలన

శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా భక్తులకు విక్రయించే ప్రసాదాల నాణ్యతను జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి రామయ్య శుక్రవారం పరిశీలించారు. మండలంలోని శంబర గ్రామం బాలుర వసతి గృహంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న ప్రసాదాలను పరిశీలించి సూచనలు చేశారు. నాణ్యత పాటించాలన్నారు. భక్తులకు అవసరమైన మేరకు ప్రసాదాలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ వీవీ సూర్యనారాయణ, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసాదం నాణ్యతను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామయ్య

భీమిలి సభను విజయవంతం చేద్దాం

- నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ఎన్నికల శంఖారావం పూరించడంలో భాగంగా విశాఖపట్నం జిల్లా భీమిలిలో ఈ నెల 25న వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ నాయకులతో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లిమర్ల నియోజకవర్గానికి సమీపంలో భీమిలి ఉందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సభకు నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని సూచించారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

28న అబ్బూరి శతజయంతి



ఆహ్వాన పత్రికలను అందిస్తున్న నిర్వాహకులు రంగనాథం

పార్వతీపురం/పార్వతీపురం టౌన్: కేంద్ర సాహిత్య అకాడమీ దక్షిణ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28న ప్రముఖ కవి, రచయిత అబ్బూరి వరదరాజేశ్వరరావు శత జయంతి వేడుకలను రాజాంలో నిర్వహించనున్నట్లు రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని ప్రముఖ రచయిత, కవి గంటేడ గౌరునాయుడు నివాసంలో పలువురు రచయితలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 28న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, పలువురు రచయితలు, కవులు వరద రాజేశ్వరరావు రచించిన కవితలు, నాటకాలు తదితర అంశాలపై పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. సమావేశంలో రచయితలు పిళ్లా తిరుపతిరావు, సిరికి స్వామినాయుడు, సమతల మహేశ్వరరావు, జిల్లా సమాచార సౌరసంబంధాల అధికారి ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు అదపాక సత్యారావును దుశ్శాలువాతో సత్కరించి మెమెంటో అందజేసి ఆయన సేవలను ప్రశంసించారు.

22న జీఎంఆర్‌నైరెడ్‌లో ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 22న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులన్నారు. పురుషులకు కంప్యూటర్ డీటీపీ(45 రోజులు)లో శిక్షణ ఉంటుందని, స్త్రీలకు లేడీస్ టైలరింగ్, హోం నర్సింగ్ కోర్సులలో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో రావాలని సూచించారు. అర్హులైన వారికి ఈ నెల 24 నుంచి శిక్షణ ప్రారంభం కానుందని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129, 9866913371, 9989953145 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

22న రామనామ సంకీర్తన

విజయనగరం రూరల్: ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో సామూహిక రామనామ సంకీర్తన నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యుడు నారాయణం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 22 సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు సామూహిక రామనామ సంకీర్తన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం అదే రోజు సాయంత్రం ప్రత్యేక దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని తిలకించేందుకు ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశామని, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించవచ్చన్నారు.

భర్తను హతమార్చిన భార్య



నిందితురాలిని చూపిస్తున్న రూరల్ సీఐ ధనుంజయరావు, ఎస్సై వెంకటరమణ, పోలీసులు

సాలూరు: మండలంలోని జీగిరాం గ్రామంలో భార్య చేతిలో హతమైన భర్త కేసును రూరల్ పోలీసులు ఒక్క రోజులోనే ఛేదించారు. దీనికి సంబంధించి రూరల్ సీఐ ధనుంజయరావు, ఎస్సై వెంకటరమణతో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. గ్రామానికి చెందిన చింతల తిరుపతి మరణంపై అనుమానాస్పద మృతి కేసు గురువారం నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. భార్య సుగుణ వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో తరచూ భార్యాభర్తలు గొడవలు పడుతుండేవారన్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం మద్యం తాగి వచ్చిన తిరుపతితో భార్య సుగుణ గొడవపడిందని, భర్త అడ్డుతొలగించుకోవాలని భావించిన ఆమె గొడవలో భాగంగా భర్త తిరుపతి వృషణాలను గాయపర్చిందన్నారు. దీంతో అపస్మారక స్థితికి భర్త చేరుకోవడంతో గొంతు నులిమి హత్యకు పాల్పడినట్లు తేలిందని, ఈ మేరకు ఆమెను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని వివరించారు.

అయ్యో రామా..!

- అయోధ్య పేరుతో టోకరా
- 120 మంది దగ్గర డబ్బుల వసూలు



గ్రామస్తులను మోసం చేసిన గునాపు సింహాద్రి

బాడంగి: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకు ఆర్ఎస్ఎస్ ఉచితంగా అవకాశం కల్పించిందంటూ మండలంలోని వీరసాగరం గ్రామస్తులను ఓ మోసగాడు బురిడీ కొట్టించాడు. దీని వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలంలోని పాతరేగ గ్రామానికి చెందిన గునాపు సింహాద్రి ఆర్ఎస్ఎస్ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నమ్మబలుకుతూ ఇటీవల వీరసాగరం గ్రామస్తులు 120 మంది వద్ద రూ.500 చొప్పున వసూలు చేశాడు. గ్రామంలోకి బస్సులు వస్తాయని, ఈ నెల 19న అందరూ సిద్ధంగా ఉండాలని చెప్పి వసూలు చేశాడు. ఉచితంగా దైవదర్శనం లభిస్తుందన్న ఆశతో గ్రామస్తులంతా రూ.500 చొప్పున చెల్లించడమే కాకుండా కల్యాణం కోసం రూ.1116 చొప్పున ముట్టజెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రయాణానికి సిద్ధమవుతున్న గ్రామస్తులు డబ్బులు వసూలు చేసిన సింహాద్రికి ఫోన్ చేయగా తాను ఆస్పత్రిలో ఉన్నానని, బస్సులను పంపిస్తానని చెప్పుకొచ్చాడు. బస్సుల అలికిడి ఎప్పటికీ లేకపోవడంతో కొంతమంది గ్రామస్తులు ఆ గ్రామానికి వెళ్లి వాకబు చేయగా సింహాద్రి మోసగాడని తేలింది. దీంతో తాము మోసపోయామని గ్రహించారు. గ్రామస్తులకు సింహాద్రి ఇచ్చిన ఫోన్‌నంబర్ 6302097782కు ఫోన్ చేస్తుంటే తనను కులం పేరుతో దూషిస్తున్నారని ఎదురు ఆరోపిస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

- విచారణ నిర్వహిస్తున్న పోలీసులు



ఘటనాస్థలంలో పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

లక్కవరపుకోట: మండలంలోని తామరాపల్లి గ్రామం శివారు నంది కొండ సమీపంలో సుమారు 45 సంవత్సరాల వయస్సుగల మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కొండ సమీపంలో మేకల కాపర్లు మృతదేహాన్ని చూసి భయభ్రాంతులకు లోనయ్యారు. ఆనోటా ఈనోటా విషయం బయటకు పొక్కి పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఆప్రాంతంలో తనిఖీ నిర్వహించి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం ఎస్.కోట సీఐ సీహెచ్.షన్ముఖరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి పుర్రె,, ఎముకులు మాత్రమే మిగిలాయి, మృతక కాటన్ చీర ధరించి, చేతులకు గాజులు వేసుకుని ఉన్నట్లు గుర్తించారు. మృతురాలి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండే అవకాశం ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మతిస్థిమితం లేని మహిళ ఇటువైపు వచ్చి మృతి చెందిందా? లేదా ఎక్కడో చంపి ఎవరైనా ఇక్కడికి తెచ్చి పడేశారా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షన్ముఖరావు తెలిపారు. అలాగే ఎస్.కోట సీహెచ్‌సీ నుంచి వైద్యులను రప్పించి ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు.



బాలుడి మృతదేహం

గల్లంతైన బాలుడి మృతదేహం..

పాచిపెంట: మండలంలోని చేరిగుడ్డి సమీపంలో ఉన్న సంకెళ్లగుమ్మి జలపాతంలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ రామభద్రపురం మండలం నేరేళ్లవలస గ్రామానికి చెందిన కాదల ప్రదీప్(15) సంక్రాంతి పండగకు మండలంలోని చేరిగుడ్డిలో ఉంటున్న మేనమామ ఇంటికి వచ్చాడు, గ్రామంలోని స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో ఉన్న సంకెళ్లగుమ్మి జలపాతానికి బుధవారం వెళ్లి ప్రమాదవశాత్తు అందులో మునిగి గల్లంతయ్యాడు.వెంటనే స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో సిబ్బందితో కలిసి తాను ఘటనాస్థలానికి వెళ్లి గజఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. రెండు రెండు రోజులు అవిశ్రాంత గాలింపు చేపట్టగా శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో మృతదేహం బయటపడిందని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించామని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.